
# డ్రింక్ పార్టీ

శనివారం....

ఓ ఆఫీసులో....ఓ సెక్షనులో... బిజీగా పని చేస్కోవాల్సిన టైంలో...

"నాలిక చాల తిమ్మిరిగా ఉందోయ్..." అన్నాడు సీతారాం పక్క సీట్లోని నారాయణతో.




"నీకు వట్టి తిమ్మిరిగానే ఉందా?...నాకైతే యమ తిమ్మిరిగా ఉంది....హిహి...." అన్నాడు నారాయణ.

"ఏంటి నాలిక తిమ్మిరి తిమ్మిరిగా ఉందని అంటున్నారు? అంటే ఏమిటి?" అడిగాడు ఎదురు సీట్లోని వెంకట్రావ్ వెర్రి మొహం వేస్కుని.

"నాలిక తిమ్మిరిగా ఉందంటే తాగాలని ఉందని అర్థం అన్నమాట!!" చెప్పాడు సీతారాం.

"ఒరేయ్ యాద్గిరీ..." అంటూ ప్యూన్ని పిలిచాడు వెంకట్రావ్.

"గేందిసాబ్?" అంటూ దగ్గరకొచ్చాడు యాద్గిరి.

"వీళ్ళకి తాగాలని ఉందట...మా ముగ్గురికీ చాయ్ తీస్కురా" చెప్పాడు వెంకట్రావ్.

సీతారాం గుండెలు బాదుకుంటూ నవ్వాడు. నారాయణ జుట్టుపీక్కుని గిలగిల్లాడుతూ నవ్వాడు. యాద్గిరి భళ్ళున నవ్వాడు.

వెంకట్రావ్ వెర్రిమొహం వేస్కొని ముగ్గురి వంకా చూశాడు.
"గేంది సాబ్... తాగుడంటే చాయ్ తాగుడా?..... తాగుడంటే బ్రాందీ, విస్కీ, బీర్ గస్మంటివి సాబ్...." అని భళ్ళున నవ్వాడు యాద్గిరి.
వెంకట్రావ్ ఓ వెర్రి నవ్వు నవ్వి చెంప నిమురుకుంటూ ఆశ్చర్యపోయాడు.
"హర్రె!....మీ ఎవరికీ చెమట పట్టడం లేదు. మరి నాకెందుకింత చెమట వస్తుంది?..." అన్నాడు రెండో చెంపకూడా తుడుచుకుంటూ.
"గది చెమ్టకాదు సాబ్! నేన్నవ్వితే ఎదురుంగా ఉన్నోల్ల మొకం గట్లనే అవుతది... " సిగ్గుపడ్తా అన్నాడు యాద్గిరి.
"ఛీ..ఛీ...ఛీ...." అంటూ వెంకట్రావ్ కర్చీఫ్‌తో మొహం తుడుచుకున్నాడు.
"మనం ఈ వేళ సాయంత్రం పెట్టుకుందామా?" అన్నాడు సీతారాం నారాయణతో.
"ఓ....నేన్రెడీ...." అన్నాడు నారాయణ.
"నేనుకూడా రెడీ ...." అంతదాకా వాళ్ళ సంభాషణ వింటున్న స్టెనో దైవాధీనం కూడా అన్నాడు.
"మరి మనం ఎక్కడ పెట్టుకుందాం? పార్టీ మీ ఇంట్లో పెట్టుకుందామా?" నారాయణ సీతారాంని అడిగాడు.
"హమ్మో... మా ఆవిడ చీపురు తిరగేస్తుంది." చెప్పాడు సీతారాం.
యాద్గిరి భళ్లున నవ్వాడు.
"నీ పాసిగూల...నీ నవ్వుతో నన్ను చంపుతున్నావ్ కదరా..." అంటూ కర్చీఫ్‌తో మొహం తుడ్చుకున్నాడు వెంకట్రావ్.
"మన పార్టీ మీ ఇంట్లో పెడ్తే ఎలా ఉంటుంది?" అన్నాడు సీతారాం దైవాధీనంతో.
"మీ ఆవిడ మామూలు చీపురు తిరగేస్తుందేమోగానీ మా ఆవిడ కొండచీపురు తిరగేస్తుంది... తెల్సా...?"అన్నాడు దైవాధీనం.
"పోనీ మా ఇంట్లో పార్టీ పెట్టుకుందాం... మా ఆవిడ పుట్టింటికి వెళ్ళింది. ఇంట్లో నేను ఒక్కడినే ఉంటాను" అన్నాడు వెంకట్రావ్.
"మరి నీకు తాగే అలవాటు లేనట్టుందిగా?" అన్నాడు దైవాధీనం.
"ఈ వేళెందుకో నాక్కూడా సర్దాగా తాగాలని ఉంది...." అన్నాడు వెంకట్రావ్ సిగ్గుపడ్తూ.
"సర్లే..అలాగే తాగుదువుగానీ... ఈ రోజు సాయంత్రమే మీ ఇంట్లో పార్టీ పెట్టుకుందాం..." అన్నాడు సీతారాం వెంకట్రావ్‌తో.

"సార్...సార్...నేను భీ వస్తా..." అన్నాడు యాద్గిరి.
"అలాగే...రావోయ్!"
"మనతో వీడు ఎందుకూ?" అన్నాడు వెంకట్రావు మొహం చిట్లిస్తూ.
"గేంది సాబ్, శానా పోజులు కొడ్తున్నవ్?... నేను పెద్దపెద్ద ఆఫీసర్లతో కల్సి తాగిన ...ఎర్కైనా? " అన్నాడు యాద్గిరి వెంకట్రావ్ వంక కోపంగా చూస్తూ.
"సర్లేవోయ్... అతనికేదో తెలీక అలా అన్నాడు... నువ్వు కూడా రా... " అన్నాడు యాద్గిరికి సర్దిచెప్తూ నారాయణ.
ఆరోజు సాయంత్రం వాళ్ళు అయిదుగురూ డబ్బులు కంట్రిబ్యూట్ చేస్కుని బాటిల్స్, చిప్స్, చేగోడీల ప్యాకెట్లు, చికెన్ సిక్స్టీఫైవ్, చికెన్ రోస్టు అన్నీ కొనుక్కుని వెంకట్రావ్ ఇంటికి వెళ్ళారు. యాద్గిరి ప్యూన్ కాబట్టి అతని దగ్గర డబ్బులు తీసుకోలేదు.
వెంకట్రావ్ జంబుఖానా కింద పరిస్తే అందరూ దానిమీద కూర్చున్నారు. వెంకట్రావ్ వంట గదిలోకి వెళ్ళి గ్లాసులూ ప్లేట్లూ తెచ్చి వాళ్ళ మధ్యన పెట్టి తనూ కూర్చోబోయి కళ్లు చిట్లించి చూశాడు.
"ఏంటిక్కడ అంతా తడి తడిగా ఉంది? ..." అన్నాడు ఆశ్చర్యంగా.
"నేను చొంగ కార్చా... బాటిల్స్ చూస్తే నాకంతే - అట్టా చొంగ కారిపోతుంది...హిహి" అన్నాడు సీతారాం.
"నాకూ అంతే ...హి" అన్నాడు నారాయణ.
"మీ చొంగ పాడుగానూ... జంబుఖానా మొత్తం తడిపేసారు కదర్రా..." అంటూ కాస్త పొడిగా ఉన్నచోట చూస్కుని కూర్చుని యాద్గిరివైపు తిరిగాడు వెంకట్రావ్.
"నువ్వు చొంగ కార్చడంలేదు... నువ్వొక్కడివీ బుద్ధిమంతుడ్లా ఉన్నావ్ యాద్గరీ!..."
యాద్గిరి భళ్లున నవ్వాడు.
మిగతా నలుగురూ జేబుల్లోంచి కర్చీఫ్‌లు తీసి మొహాలు తుడ్చుకున్నారు.
"వాడు చొంగ కార్చడంలేదని సంతోషిస్తున్నావ్‌గానీ వాడిట్టానవ్వితే అందరి గ్లాసుల్లోని విస్కీ లైట్ అయిపోతుంది" అన్నాడు సీతారాం జాలిగా నవ్వుతూ.
"అలాగైతే విస్కీ గ్లాసులోకి పోసిన తర్వాత నువ్వు నవ్వడానికి వీల్లేదు - ఇప్పుడే చెప్తున్నా..." అంటూ యాద్గిరిని వార్న్ చేశాడు వెంకట్రా-

దైవాధీనం ప్లేట్లలో చిప్స్, చికెన్ వగైరాలన్నీ సర్దాడు. సీతారాం గ్లాసులో కాస్త కాస్త విస్కీ పోసి, తర్వాత నీళ్లతో నింపాడు.
అందరూ గ్లాసుల్ని చేతుల్లోకి తీస్కున్నారు.
"చీర్స్..." అన్నారు గ్లాసుల్ని ఒకదానికి ఒకటి తాకిస్తూ.
అందరూ పెదాలకి గ్లాసుల్ని తాకించారు. వెంకట్రావ్ మాత్రం పెదాలదాకా గ్లాసుని తీస్కొచ్చి పెదాలకి తాకించకుండా కళ్లు చిట్లించి గ్లాసువంక చూశాడు. తర్వాత ముక్కు దగ్గర పెట్టుకుని "బుస... బుస..." శబ్దం చేస్తూ వాసన చూసి మొహం చిట్లించాడు.
"ఎంటా వెర్రి చేష్టలు...మొదట్లో అలానే అనిపిస్తుందిలే... తాగు" అన్నాడు దైవాధీనం.
వెంకట్రావ్ గ్లాసులోది ఒక సిప్ చేసి ముక్కు ముడిచి నొసలు చిట్లించి నాలుక బయట పెట్టి "ఘె ఘె ఘె..." అన్నాడు గొంతుతో.
"ఊ... ఊ... మింగూ..." అన్నాడు సీతారాం వెంకట్రావ్ మూడుమీద చరుస్తూ.
వెంకట్రావ్ మరో గుటక వేశాడు. తర్వాత ఇంకోటి...ఇంకోటి...
మెల్లగా అలవాటు కాసాగింది అతనికి ఆ రుచీ, ఆ వాసనా.
అందరూ గ్లాసులు ఖాళీ చేస్తున్నారు. గ్లాసులు నింపుతున్నారు. మళ్లీ ఖాళీ చేస్తున్నారు. మళ్లీ నింపుతున్నారు.
సీతారాం అయితే గ్లాసు తర్వాత గ్లాసు, గ్లాసు తర్వాత గ్లాసు ఖాళీ చేసేస్తున్నాడు.
"ఏందిబే వెంకట్రావ్!....నన్ను మీ ఇంటికి తాగనీకి రావొద్దన్నావ్ షురూ షురూల... సాలె!..." అంటూ వెంకట్రావ్ వీపు మీద గుద్దాడు యాద్గిరి.
"ఏయ్... ఏంటోయ్ నీ వ్యవహారం?" కాలరు పట్టుకున్నాడు వెంకట్రావ్.
అందరూ ఘొల్లున నవ్వారు.
"నీ బొంద... నీ కిటువంటివి అలవాటు లేదు కాబట్టి అలా రియాక్ట్ అవుతున్నావ్... అసలు ఎవరైనా తాగింతర్వాత ఏమైనా అంటే పట్టించుకుంటారా ఎక్కడైనా.. ఏదో తాగి అన్నాడులే అని వదిలెయ్యాలి" అన్నాడు దైవాధీనం.
"అలాగా? దొంగెధవా... రాస్కెల్... బద్మాష్!" అంటూ దైవాధీనాన్ని తిట్టాడు వెంకట్రావ్.
దైవాధీనం వెంకట్రావ్ డిప్పకాయ ఫెడీల్మనిపించాడు.

"ఏమనుకోకూడదని నాకు నీతులు చెప్పి నువ్వెందుకలా కొట్టావ్?" బుర్రకాయ్ తడుముకుంటూ అన్నాడు వెంకట్రావ్ చిరాగ్గా.

"నువ్వు మా అంత తాగలేదుగా... ఒక్క పెగ్గే తాగావ్ మరి – " వివరణ ఇచ్చాడు దైవాధీనం.

"ఓహో... అట్టాగా?... అలాగైతే చూడు."

వెంకట్రావ్ గటగటా రెండు పెగ్గులు తాగాడు. తర్వాత దైవాధీనం కేసి తిరిగి "దొంగ వెధవా... రాస్కెల్... బద్మాష్..." అన్నాడు.

దైవాధీనం పకపకా నవ్వి "వీడికెక్కాడా ఎక్కిందిరోయ్..." అన్నాడు.

వెంకట్రావ్ తృప్తిగా నవ్వుకున్నాడు.

నారాయణ హఠాత్తుగా భళ్లున వాంతి చేస్కున్నాడు. అతను వాంతి చేస్కుంది అందరిమీదా అంతో ఇంతో తుళ్లింది. అయినా వాళ్లేం పట్టించుకోలేదు.

"ఒరేయ్... ఇపుడు చక్కని చుక్క కూడా ఉంటే బాగుంటుంది కదరా..." అన్నాడు దైవాధీనం.

"అబ్బే వెంకట్...యాడ్కెల్లన్నా ఓ పోరిని తీస్కరా" అన్నాడు యాద్గిరి వెంకట్రావ్ వీపుమీద సర్దాగా గుద్దుతూ.

"ఎక్కడ్నుంచో ఎందుకరా...వీడి పెళ్లాం ఉందిగా.... మనం అందరం ఒకరి తర్వాత ఒకరం.. హిహిహి" అన్నాడు సీతారాం.

అతని మాట పూర్తికాకముందే వెంకట్రావ్ పిడికిలి బిగించి సీతారాం మూతిమీద ఒక గుద్దు గుద్దాడు. ఆ దెబ్బకి అతని ముందు పళ్లు రెండు ఊడిపోయాయ్. ఆ తర్వాత సీతారాం పీకుచ్చుకున్నాడు వెంకట్రావ్. మిగతా ముగ్గురూ అతన్ని పట్టుకుని లాగి విడిపించారు.

"అదేంటోయ్... అతను తాగిన మైకంలో ఏమంటున్నాడో తెలీక అన్నాడు. దాన్ని అంత సీరియస్‌గా తీస్కుంటావేం?... నేనిందాకే చెప్పాను తాగినవాడు ఏమన్నా, ఏం చేసినా పట్టించుకోకూడదని," అన్నాడు ముద్దముద్దగా దైవాధీనం.

వెంకట్రావ్ నాలుక కర్చుకుని "హర్రే... ఆ విషయమే మర్చిపోయానే..." అని సీతారాం వైపు తిరిగి –

"ఏమన్నావ్.... మా అవిడ కావాలా? మా ఆవిడ ఇక్కడ లేదుగా!!! పుట్టింటికెళ్లింది" అన్నాడు.

"పోనీలే... పుట్టింటినుండి వచ్చాక నా దగ్గరికే పంపించు" అన్నాడు

సీతారాం ముద్దముద్దగా.
"హి... వెర్రి నాయాలుకి బాగా మత్తెక్కి పోయింది... హిహి..." నవ్వాడు వెంకట్రావ్.
అలా తాగుతూ తాగుతూ, తింటూ తాగుతూ సీసాలు ఖాళీ చేశారు. అప్పటికి రాత్రి పదకొండు గంటలు దాటింది. అయిదుగురూ కేకలు వేస్తూ డాన్సులు చేస్తూ రోడ్డుమీద పడి అల్లరి చేయసాగారు.
అప్పుడు అ వైపుగా వస్తున్న పోలీసు జీపు వీళ్లముందు ఆగింది.
"తాగి రోడ్డుమీద ఏంటి అల్లరి?" అరిచాడు ఇన్స్పెక్టర్ కోపంగా జీపులోంచి కిందికి దిగి.
"పోరా నీ మొహం... తాగినోళ్లే అల్లరి చేస్తారు. తాగనోళ్లు చేస్తారా సన్నాసెదవా!" అన్నాడు సీతారాం.
నారాయణ ఇన్స్పెక్టర్‌కి జల్లకాయ్ కొట్టాడు.
అంతే... ఇన్స్పెక్టర్, కానిస్టేబుల్స్, అయిదుగుర్నీ జబ్బపట్టి లాగి జీపెక్కించి పోలీస్టేషన్‌కి తీస్కెళ్లి మోకాలు చిప్పలు పగిలేలా లాఠీలతో కొట్టారు.
దాంతో వాళ్ళకి మత్తు వదిలిపోయింది. "తాగిన మైకంలో తెలీక ఏదో అన్నాం... క్షమించండి" అని ఇన్స్పెక్టర్ కాళ్లమీద పడ్డారు.
దయదల్చి అయిదుగుర్నీ వదలిపెట్టాడు ఇన్స్పెక్టర్. అయిదుగురూ ఎవరిళ్లకి వాళ్లు వెళ్లిపోయారు.
ఆ మర్నాడు... ఆఫీసులో -
"ఏంటోయ్... నిన్న మీరు వెంకట్రావ్ ఇంట్లో పార్టీ చేస్కున్నారటగా..." అడిగాడు సీతారాంని రామారావు.
"అవునోయ్... నువ్వు లీవ్ పెట్టి మంచి పార్టీ మిస్సయ్యావ్... లేకపోతే నిన్నుకూడా తీస్కెళ్లి ఉండేవాళ్లం. పార్టీ భలేగా ఎంజాయ్ చేశామనుకో" బొక్కపళ్లతో నవ్వుతూ అన్నాడు సీతారాం.
"అవునవును... భలేగా ఎంజాయ్ చేశాం" అన్నారు మిగతా నలుగురూ.

* * *